కవితా కౌముది

# జవాబు లేని ప్రశ్న

స్వాతీ శ్రీపాద

చిత్రం..!
ఏది ఎప్పుడు చటుక్కున పైకుబికి రావాలో
దానికన్నా ఎవరికి బాగా తెలుసు?
లోలోపలి చీకటి గదిలో
ఎప్పటికప్పుడు స్వయం రక్షణ లోకి జారి
పొందికగా అమరిన ఘుడియలూ విఘుడియలూ
చెదలూ చట్టుబండలూ తినలేని రక్షిత స్థితిలో
అధీనంలో ఉంచుకునేదెవరో మరి?

అమ్మ చీరకొంగు వెనకాల దాచుకున్న బాల్యం
ఎప్పుడో ఎక్కడో చటుక్కున గాలిపటంలా గారాలుపోడం
ఎంత గిలగిలలాడినా సముద్ర గర్భం లో నిక్షిప్తమైనట్టు
చుట్టూ గోడలు కట్టి సమాధి చేసినట్టు
ఏమాత్రం అజాపజా చిక్కని యౌవన అనుభుతులు
ఏ దివి సీమ వలిపెపు చీర అంచులు పట్టుకు
గగన విహారం సాగించడం ఎక్కడిదీ
వింత సోయగం?

ఒక సంధ్యా సమయానో
ఖాళీగా విశ్రమించిన చలిగాలి మసక వెలుతురులోనో
ఉన్నట్టుండి అరచేతిలో ఒలికిన అత్తరు సీసాలా

గుప్పుగుప్పున గాఢంగా పరిమళించే చర్విత చర్వణాలు
ఎవరు పిలిచిన అతిథులు?

ఎవరికి వారికి తప్ప రెండో ప్రసక్తిలేని కథనాలు
ఎన్ని సార్లు మళ్ళీ మళ్ళీ చుట్టు చుట్టూ
మచ్చిక చేసుకున్న కుక్కపిల్లల్లా ఎక్కడీ నుంది పరుగెత్తుకు
వస్తాయి?
చీకతి దారుల్లో దాచుకున్న నదీ నదాలూ
గిరులూ తరులూ ఏ నాటి బాసలూ తట్టి పిలుస్తున్నాయి?

విప్పి చెప్పినా కప్పి చెప్పినా
ఉనికి వెనకాల రహస్యం చిక్కు ప్రశ్నకు
జవాబులు లేవు- ప్రశ్నలు తప్ప.



# వైనం

## లక్ష్మి కందిమళ్ళ

వాళ్ళు
ఏదో ప్రశ్న వేస్తారు
తెలీదు.. అంటావు. !
తిరిగి  వ్యంగ్యంగా
ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు
అదొక
ఊపిరాడ నివ్వని
వలలా విసురుతూ
అక్కడ,
ముఖానికి ముసుగు వేసుకున్న ఒక వ్యక్తి..!
అయినా నీకు అబద్ధం చెప్పడం రాదు
అందుకే
ఎవరికి ఎలా అర్థం అవుతుందో
అలా అర్థం చేసుకోమని చెబుతావు..!
నిజంగానే
ఆ తీసివేతలు,కూడికలు తెలీవు,నీకు..!
నీ లోకంలో నువ్వు
వీచే గాలి స్పర్శకు పులకిస్తూ,
విచ్చుకునే పూలను చూసి పరవశిస్తూ
అలా నువ్వు ఒక నిజమై పోతుంటావు..!
అదే నిజం
నిజంలోని నిజం
మంచిని ప్రేమించే నైజంలోని నిజం
మనిషిగా బ్రతకాలన్న వైనంలోని నిజం
నిజానికి అది ఎంతో నిజం.

★★★

# ఓ వర్షపు ఉదయం

## అనూరాధ బండి

వరండాలో తేనీరు తాగుతూన్నప్పుడు:
ఎన్నెన్నో వినిపిస్తాయి.
మరెన్నో కనిపిస్తాయి..!
ఏ పక్షినీ అవ్వలేను.
ఏ దృశ్యం వెంటా వెళ్ళలేను.
స్పందించే హృదయంలో మెతకదనం
ఒక్కోసారి కన్నీరవుతోంది..!
రాత్రి కలలు, గాలికి ఊగుతున్న ఆకులనీ
లేదూ వణుకుతున్న భయాలు అనీ అనిపిస్తున్నాయి.
వర్షమొచ్చిపోగా, చెట్లు మిగుల్చుకున్న
చినుకులు రాలినప్పుడంతా,
దుఃఖపడడమెందుకో అర్థమవ్వదు…!
నువ్వు వినగలవా!
ఒక మనిషిలోని ఒంటరితనాన్నీ?!
నీకు తెలుసా? అది ఏమని పాడుతుందో?
నీకు తెలుసా? ఎవరులో ఏమి దాగుందో!..
చెప్పాలా, ఒకటి..
ఈ వెలుతురులోనూ చీకటే కనిపిస్తున్నది.
ప్రతి దృశ్యమూ నిదానంగా నలుపై, కంటిలో
నలుపై నలుగుతోంది.
చూపును నలుపుతోంది..!
నన్ను నేనే ఒలుచుకుని ఒక క్రొత్త రంగుని చూస్తానా!?
మళ్ళీ వర్షం.
వింటున్నా!
గుండె చప్పుడులోని భయాన్ని, చల్లగాలితో కలిసి.

★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఆప్తమిత్రులెచ్చోటికో యరిగినపుడు
అలిగి యెన్నటికిని వెనుదిరగనపుడు
గడచునెదురు చూచుచు మన కాలమెల్ల
కనులు వెదకును శూన్యమార్గమ్ములందు

విడచి యేగిన వారితో వెడల లేము
హితులు లేనట్టి శూన్యమందిమడలేము
మమత పంచగల్గెడు ప్రియతములు లేక
గడప సాధ్యమే యిసుమంత కాలమైన

ఎవరొ లేరని మనసు చింతించుచుండు
ఉన్నవారలతో మనసూరడిల్లు
వెడలెదరు కొందరు మన జీవితమునుండి
చెంతచేరవత్తురు మరికొంతమంది

కొందరాప్తులై మన చెంతనుందురెపుడు
వెడలినట్టి వారల మరపించుచుంద్రు
అంతరంగాన వసియింతురందరున్ను
బ్రతుకు సార్థకమౌ గాదె వారి వలన

అనుగుమిత్రులు లేని శూన్యమ్ము వలదు
కావలయునాప్తమిత్రసాంగత్యమెపుడు
ప్రేమ పంచిన మనకును ప్రేమ దక్కు
హితులమైనచోనందరు హితులె మనకు

COMMENTS